రంగారావు.

చుట్టూచేరి చోద్యం చూస్తున్నవాళ్ళలో ఒకడు, "ఎవరివయ్యా నువ్వు, దొంగ వెధవల్ని సపోర్టు చేస్తావు" అన్నాడు.

రంగారావు జనాన్నుద్దేశించి, "అయ్యా! మీరు చోద్యం చూద్దాని కొచ్చారు. అలా చూస్తూ నిలబడండి. సాటి మనిషి హింసకు గురవుతూంటే కలగ జేసుకునే కొత్త అలవాటు మీరు చేసుకోకండి..."

అని సుబ్బరాజుతో, "నీ గల్లా పెట్టెలో పది రూపాయిలు మాయమయ్యాయి. ఈ కుర్రాణ్ణి నువ్వు నమ్మనంటున్నావు కదా! అలాగే ఈ కుర్రాడు నన్ను నమ్మి ఓ గంటలో ఇచ్చేస్తానంటే పది రూపాయిలు అప్పుగా నాకిచ్చాడు. అని తిరిగి ఇవ్వడానికే వచ్చాను...." అంటూ పది రూపాయిల నోటు తిరిగి ఇచ్చి సుబ్బరాజుని సాచి లెంపకాయ కొట్టాడు.

ఆ తర్వాత అంత మంది జనం చూస్తుండగా రంగారావు సుబ్బరాజుని చావ గొట్టాడు. కండలు తిరిగిన బలిష్టమైన వాడి శరీరం చూసి చాలా మంది వాణ్ణాప దానికి భయ పడ్డారు.

కసితీరా సుబ్బరాజుని కొట్టేక, "ఇంత కొట్టినా బట్టలు చిరిగాయి తప్ప నక్కు నలగ లేదు నీకు. నీ కొవ్వు చీల్చుకుని రక్తం బైటకు చిమ్మేలా చేస్తానుండు" అంటూ రంగారావు జేబులోంచి కత్తి తీశాడు.

చుట్టూ వున్న జనం నివ్వెర పోయారు. సుబ్బరాజు రక్షించండి అని అరవడానికి బదులు, "నన్నేం చేయకు" అని రంగారావుని వేడుకున్నాడు.

"నీ చెయ్యి అమాయకుణ్ని కొట్టడానికి లేస్తోందో దాన్ని శాశ్వతంగా చచ్చు పడేలా చేస్తాను" అంటూ రంగారావు చేతిమీద గట్టిగా పొడిచాడు.

రక్తం చివ్వున చిమ్మింది.

వాడింకా ఎన్ని పోట్లు పొడిచాడో కాని విషయం తెలిసి ఎక్కడో పద్దులు రాస్తున్న చలపతి అక్కడికి పరుగున వచ్చి అడ్డుపడి సుబ్బరాజుని రక్షించాడు.

"దెబ్బతిన్నవాళ్ళు నిన్ను క్షమించి రక్షించవచ్చు. కానీ వాళ్ళ బిడ్డలు సహించరు. నీ అక్రమాలు తరతరాలు కొనసాగవు. గుర్తుంచుకో" అంటూ రంగారావక్కణ్ణించి నిష్క్రమించాడు.

* * * * * *

రంగారావు కటకటాల వెనుక వున్నాడు.

కటకటాల కివతల రంగారావు తల్లి దండ్రులు కన్నీళ్ళతో వాణ్ణే చూస్తున్నారు.

"మొత్తం మీద జైల్లో అడుగు పెట్టావు. ఇదింతటితో ఆగుతుందను కోను..." అన్నాడు చలపతి.

"మూడు నెలలేగా!" అన్నాడు రంగారావు నిర్లక్ష్యంగా.

"జైలు కెళ్ళడం అవమానంగా లేదట్రా నీకు!" అంది తల్లి.

"నేను చేసిన నేరానికి అయిదేళ్ళ శిక్ష పడాల్సింది. కానీ నా శ్రేయోభిలాషులు గలగ జేసుకొని మూణ్ణెల్లకు తగ్గించారు. ఇందుకు నేను గర్వ పడాలి..." అన్నాడు రంగారావు.

"నీ శ్రేయాభిలాషులు మంచి వాళ్ళు కారు. సమాజానికే చీడపురుగులు...

"నాన్నా! దెబ్బలు తింటూ చీడ పురుగుల్ని నువ్వు సహిస్తున్నావు. దెబ్బ తీయడానికి చీడ పురుగుల్ని నేను సహిస్తాను. చీడ పురుగుల్ని సహించడం తప్ప నప్పుడు నాకు నీ పద్ధతి కంటే నా పద్ధతే మేలనిపిస్తుంది...

"నీ పద్ధతిలో ఏం సాధించావురా? ఆ సుబ్బరాజు కేం సుఖంగా వున్నాడు. నువ్వే జైలు పాలయ్యావు... ఏడ్చింది తల్లి.

"సుబ్బరాజుని ఎముకలు విరిగేలా కొట్టాను. రక్తం వచ్చేలా పొడిచాను. సుఖంగా ఎలా వుంటాడు? వాణ్ణి హాస్పిటల్లో చేర్చలేదా?" అన్నాడు రంగారావు.

"చేర్చారు. తుంటి ఎముక విరిగింది. ఆర్నెల్లు హాస్పిటల్లో బెడ్‌మీద వుండాలిట..." అన్నాడు చలపతి.

"చూశావా అమ్మా! నేనీ జెయిల్లో వుండేది మూణ్ణెల్లే! కానీ ఆ సుబ్బరాజు హాస్పిటల్లో వుండేది ఆర్నెల్లు... నేనేం సాధించ లేదంటా వేమిటి?" అన్నాడు రంగారావు ఉత్సాహంగా.

చలపతి, భార్యా అవాక్కై వాడి వంకే చూస్తూండి పోయారు. వాడు జైలు నుంచి తిరిగి రాకుండా వుంటే బాగుణ్ణు అనుకున్నారు.






# మాయ మనసు

వారం రోజుల బట్టి లేవడం లేదు గోపాల్రావు. అతని ముప్పై ఏళ్ళ వయసులో ఇలా అస్వస్థత పాలై, మూలుగుతూ పడకవేయడం ఇదే ప్రథమం. పేపర్ చదివే ఓపికలేదు. నిలబడితే చాలు నీరసంతో కళ్ళు గిర్రున తిరిగి, చీకట్లు కమ్మేని. కడుపులోకి ఏమీ పోవడం లేదసలు.

వైద్యుడి ప్రావీణ్యత గురించి అనుమానం అనవసరం. రక్తపరీక్ష, మూత్ర పరీక్ష... వగైరాలతో, రోగాన్ని 'డయాగ్నైజ్' చెయ్యడానికి కుస్తీ పడుతున్నాడు.

ఎప్పుడు అమితోత్సాహంతో-సిడిరాయిలా వుండే తనకీ దుస్థితి దాపురించిదేమిటి...?

ఈ పరీక్షేమిటి తనకి? ఈ వెధవ యాతన కంటే ఒక్కసారి ప్రాణం పోతే ఎంత హాయి!?

అనారోగ్యం కలిగించిన వైరాగ్యం అది.

** ** ** **

వారం తర్వాత...

గోపాల్రావు మళ్లీ మునుపటి మనిషి... కాదు, కాదు, రెట్టించిన ఉత్సాహం, ద్విగుణీకృతమైన చలాకీ తనంతో తుళ్ళిపడుతున్నాడు.

'కొలీగ్' రాఘవరావుకి ప్రమోషన్ రావడంతో ఆ 'అకేషన్ని' 'బాంబె బార్'లో ఘనంగా జరుపుకుంటున్నారు.

గోపాల్రావు ఎంతో ఇష్టంగా 'బీర్' సిప్ చేస్తూ, ఎర్రటి చికెన్ వేపుడు ఆత్రంగా తినేస్తూ- 'సెక్సీ' జోకులతో మిత్ర బృందాన్ని అలరిస్తున్నాడు.

'ఈ జీవితం దేవుడిచ్చిన వరం, బ్రదర్స్! ప్రతి క్షణాన్ని సద్వినియోగపర్చుకుంటూ... ఆనందాలు జుర్రుకుని, సుఖాల్ని పిండుకోవాలి.

దేవుడు నన్ను వరం కోరుకొమ్మంటే- వెయ్యేళ్ళ ఆయుర్దాన్ని కోరుకుంటాను...' అంటూ గడ, గడా మాట్లాడేస్తుంటే- అతనిలోని 'మాయమనసు' సిచ్చివాడా... అని జాలిపడ్తోంది.

అవధానుల సుధాకరరావు